

వెంకటగిరిలో జన సునామీ

టీడీపీ బహిరంగసభకు పోటెత్తిన ప్రజానీకం

చంద్రబాబుపై శ్రేణుల్లో ఇనుమడించిన అభిమానం

సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయిన జిల్లా పార్టీ నేతలు

వెంకటగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో శుక్రవారం చంద్రబాబు పాల్గొన్న 'రా కదలిరా' బహిరంగసభకు జనం పోటెత్తారు. అధినేత పట్ల శ్రేణుల్లోనూ, ప్రజల్లోనూ అభిమానం, ఆదరణ మరింతగా ఇనుమడించిన వైనం సభలో కళ్లకు కట్టింది. వెంకటగిరి సెగ్మెంట్ నుంచీ భారీఎత్తున శ్రేణులు తరలి రాగా శ్రీకాళహస్తి, గూడూరు నియోజకవర్గాల నుంచీ కూడా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు సభకు హాజరయ్యారు. ఇక తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని మిగిలిన సెగ్మెంట్ల నుంచీ కూడా ఇంచార్జులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పార్టీ శ్రేణుల్ని సమీకరించడంతో వెంకటగిరి హెలిపాడ్ వద్ద, పట్టణ ప్రధాన రహదారులతో పాటు బహిరంగసభాస్థలి, పరిసర ప్రాంతాలు కూడా జనంతో నిండిపోయాయి. చంద్రబాబు మధ్యాహ్నం 11.47 గంటలకు హెలికాప్టర్‌లో వెంకటగిరి చేరుకున్నారు. అక్కడ నుంచీ 12.20 గంటలకు సభా వేదికపైకి చేరుకున్నారు. 12.52 గంటలకు ప్రసంగం ప్రారంభించిన ఆయన 1.42 దాకా మాట్లాడారు. ఎండ చురుగ్గా వుండడంతో పాటు ఆకలి వేస్తున్నా పార్టీ శ్రేణులు గానీ, ప్రజలు గానీ బహిరంగసభా ప్రాంగణం నుంచీ కదలలేదు. చంద్రబాబు వేదికపైకి వచ్చినపుడు జనం నుంచీ వచ్చిన స్పందన చూశాక ఆయన పట్ల శ్రేణుల్లో అభిమానం మరింత పెరిగినట్టు అనిపించింది. పలు అంశాలపై నేరుగా శ్రేణులనే ప్రశ్నించినపుడు కూడా కార్యకర్తలతో పాటు జనం ఉత్సాహంగా స్పందించి సమాధానాలిచ్చారు. చంద్రబాబు సభాస్థలి నుంచీ వెనుదిరిగాకే జనం వెలుపలికి వచ్చారు. వెంకటగిరి పట్టణ చరిత్రలో ఓ రాజకీయ సభకు ఈ స్థాయిలో జనం హాజరు కావడం విశేషమని స్థానికులు మాట్లాడుకోవడం వినిపించింది. అంచనాలకు మించి జనం హాజరు కావడంతో తిరుపతి జిల్లా టీడీపీ నేతలు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.





వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలైంది. రానున్న ఎన్నికల్లో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాలూ గెలుస్తున్నాం.

జిల్లా మారినా జనం రాత మారిందా?

వెంకటగిరిలో బ్రహ్మాండమైన బహిరంగసభలో వేలాదిగా హాజరైన పార్టీ శ్రేణులను, ప్రజలనుద్దేశించి మాట్లాడిన చంద్రబాబు జిల్లా ప్రధాన అంశాలను ప్రస్తావిస్తూ, ప్రజలకు ప్రశ్నలు సంధిస్తూ, వారి నుంచి సమాధానాలు రాబడుతూ ఉత్సాహంగా, ఉద్వేగంగా ప్రసంగించారు. ఆయన ప్రసంగంలోని కొన్ని ముఖ్యాంశాలు ఇవీ...

అప్పుడు.. ఇవి చేశాను

"గతంలో నేను నెల్లూరు, తిరుపతి, చెన్నైలను అనుసంధానించి ఉమ్మడి నెల్లూరు జిల్లాను పారిశ్రామిక హబ్‌గా చేయాలనుకున్నాను. నెల్లూరు జిల్లా దగదర్తిలో విమానాశ్రయం, కృష్ణపట్నం పోర్టు ఏర్పాటు చేయడం ద్వారా జిల్లాను పారిశ్రామికంగా ఉన్నత స్థాయికి చేర్చాలని ప్రయత్నించాను. తిరుపతిలో ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేశాను. దానివల్ల అక్కడ టీసీఎల్, జోహో, సెల్‌కాన్, కార్బన్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కంపెనీలు అనేకం వచ్చాయి. తిరుపతి సహా తూర్పు ప్రాంతాన్ని ఆటోమొబైల్ హబ్ చేయడానికి చర్యలు తీసుకున్నా. ఫలితంగా అపోలో టైర్స్ వంటి ఆటోమొబైల్ సంబంధ పరిశ్రమలు చాలా ఏర్పాటయ్యాయి. ఏర్పేడు, వెంకటగిరి మధ్య ఐఐటీ, ఐసర్ వంటి అత్యున్నత జాతీయ విద్యా సంస్థలు ఏర్పాటు జరిగింది."

ఇప్పుడు ఇలా దోచేశారు

"ఈ ప్రాంత అభివృద్ధికి చేపట్టిన అనేక పనులు జగన్ ప్రభుత్వంలో ఆగిపోయాయి. అల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణానికి రూ. 399 కోట్లతో నేను పనులు మంజూరు చేస్తే కేవలం రూ. 19 కోట్లు ఖర్చు చేశాక పనులు ఆపేశారు. కండలేరు ప్రాజెక్టు పనులు ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయకపోవడంతో దానిపై ఆధారపడిన తెలుగుగంగ ప్రాజెక్టు కూడా పూర్తి కాకుండా ఆగిపోయింది. గూడూరులో రూ. 4500 కోట్ల విలువైన సిలికా ఇసుకను ఇష్టానుసారంగా అమ్మేస్తున్నారు. ప్రభుత్వం నుంచీ లైసెన్సు పొందిన అసలైన లీజు హోల్డర్లను తరిమేశారు. క్వార్ట్జ్, బెరైటీస్, లేటరైట్, లైమ్ స్టోన్ వంటి మైన్లన్నీ అక్రమ మైనింగ్‌తో కొల్లగొట్టేశారు."





వైసీపీ నేతలపై బాబు పంచ్‌లు

ఈ ప్రాంత అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల కోసం గళం విప్పిన ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిని సీఎం జగన్ దూరంగా పెట్టారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలో అధికార పార్టీ ఎమ్మెల్యేల దోపిడీపై ధ్వజమెత్తారు.

- సర్వేపల్లిలో మంత్రి కాకాణి కోర్టు దొంగ. గ్రావెల్ దోపిడీకి పాల్పడిన కాకాణికి ఇపుడు నెల్లూరు జిల్లాను కొనే శక్తి వచ్చేసింది.
- సత్యవేడు ఎమ్మెల్యే ఒట్టి రబ్బర్ స్టాంపు. అతడి నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి పెత్తనం సాగుతోంది.
- పెద్దిరెడ్డి మామూలు పుడింగి కాదు. రాష్ట్రంలోని మైన్లన్నింటినీ మింగేసి అరిగించుకోగల శక్తి ఆయనకు ఉంది.
- గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ మైన్లను ప్రసాదం తరహాలో మింగేశాడు. మామూళ్ళ వసూలు కోసం కొడుకును పెట్టాడు. ఆ రూ.4500 కోట్ల సిలికా దోపిడీలో ఎమ్మెల్యే వాటా ఎంతో చెప్పాలి.
- వెంకటగిరికి కొత్త బిచ్చగాడు వచ్చాడు. ఆయన పెన్నా నదిలో ఇసుక దోపిడీకి పాల్పడుతున్నాడు. 150 ఎకరాల్లో సిలికా దోపిడీ చేశాడు. నియోజకవర్గంలో విపరీతంగా భూ కబ్జాలకు పాల్పడుతున్నాడు. పార్టీ ఇంచార్జిగానే ఇలా బరితెగించే ఆయన ఒకవేళ ఎమ్మెల్యే అయితే ఇంకేం చేస్తాడో ఊహించుకోండి.
- సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇసుక, లిక్కర్, గంజాయి, క్రికెట్ బెట్టింగులు వంటి అక్రమ దందాలకు పాల్పడుతున్నారడు. సీఎం జగన్ విశాఖలో రిషికొండను బోడి చేసిన స్ఫూర్తితో శిరసనంబేడు కొండకు ఈయన గుండు కొట్టాడు.
- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు రెడ్డి అవినీతి చూస్తుంటే కళ్లు తిరుగుతున్నాయి. అక్కడ రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగింది. రేణిగుంటను కూతురికి, ఏర్పేడును తమ్ముడికి రాసిచ్చేసి, శ్రీకాళహస్తిని తన సొంతానికి పెట్టుకున్నాడు.
- తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నాస్తికుడు. ఇపుడు దేవుడికే నామాలు పెడుతున్నాడు.

పైరవీల ధర్మారెడ్డి

తిరుమల ఈవో ధర్మారెడ్డిపై కూడా చంద్రబాబు పరోక్ష విమర్శలు చేశారు. శ్రీవారిని అడ్డం పెట్టుకుని పైరవీలతో కేసులు లేకుండా చేసే బాధ్యతను జగన్ ఆ అధికారికి అప్పగించారని ఆరోపించారు. సర్వీసులో ఒక్కసారైనా టీటీడీ ఈవో కావాలని కలలు కనే సీనియర్ ఐఏఎస్‌లకు కూడా ఇవ్వకుండా జగన్ తన కేసుల కోసమే ఆ అధికారిని ఈవోగా నియమించారన్నారు.



గూడూరు, వెంకటగిరికి వరాలు

అధికారంలోకి వచ్చాక గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తా. ప్రతి చేనేత కుటుంబానికీ ఇపుడు వైసీపీ ప్రభుత్వం ఇస్తున్న దానికంటే ఎక్కువ సాయం అందిస్తా. ఆక్వా రైతులకు యూనిట్ ఒకటిన్నర రూపాయి చొప్పున సబ్సిడీ విద్యుత్ అందిస్తా. డక్కిలి మండలంలో అల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణాన్ని, అలాగే కండలేరు రిజర్వాయరు పెండింగ్ పనులను, తెలుగు గంగ ప్రాజెక్టు పెండింగు పనులను పూర్తి చేస్తాం. వెంకటగిరిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీకి అనుబంధంగా స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీ ఏర్పాటు చేస్తా. స్వర్ణముఖి నదిపై చెక్‌డ్యాములు, వెంకటగిరి-నాయుడుపేట మార్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తా.

సభలో ప్రముఖులు : చంద్రబాబు సభలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, రాష్ట్ర మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, బీసీ నాయకుడు మస్తాన్ యాదవ్,వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రాంగోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, సునీల్ కుమార్, నెలవల సుబ్రమణ్యం, సుగుణమ్మ, కంభం విజయరామిరెడ్డి, టీడీపీ ఇంఛార్జులు గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, జనసేన నెల్లూరు, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు మధుక్రాంత రెడ్డి, పసుపులేటి హరిప్రసాద్, వెంకటగిరి జనసేన నాయకులు తోట కృష్ణయ్య, గూడూరు వెంకటేశ్వర్లు, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, వూకా విజయకుమార్, వెంపటి మాధవుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పుంగనూరుకొస్తా!

'నేను ముంబైలో ఉండడంతో ఇలాంటి సంక్రాంతి సంబరాలను చూడలేదు. అందువల్ల వచ్చే ఏడాది వేడుకల్లో పాల్గొనడానికి తప్పకుండా మళ్లీ పుంగనూరుకు వస్తా' అని సినీ నటి తమన్నా అన్నారు. బీసీవై పార్టీ నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు శుక్రవారం ఆమె బహుమతులు ప్రదానం చేశారు.



మృతులు, దొంగ ఓట్లను తొలగించాలి

కలెక్టరేట్ వద్ద టీడీపీ నాయకుల ధర్నా

చిత్తూరు, జనవరి 19: మృతులు, దొంగ ఓట్లను ముసాయిదా జాబితా నుంచి తొలగించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు ఇన్‌చార్జిలు మురళీమోహన్, థామస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, మాజీ మేయర్ కఠారి హేమలత ప్రసంగించారు. జిల్లాలోని ప్రతి బూత్‌లో చనిపోయిన వారి ఓట్లు, నివాసప్రాంతాల్లో లేని ఓటర్లు, బోగస్ ఓట్ల గురించి బీఎల్వోలకు, ఎలక్టోరల్ అధికారులకు, కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ 90 శాతం వరకు ముసాయిదా ఓటర్ల జాబితా తప్పులతడకగా ఉందన్నారు. మృతుల ఓట్లు, తప్పుడు సమాచారంతో ఫారం-6తో ఓటర్ల నమోదుకు అధికారపార్టీ నాయకులు వేల సంఖ్యలో దరఖాస్తులు చేశారన్నారు. టీడీపీ, ఇతర ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓట్లను తొలగించడం కోసం అధికార పార్టీ నేతల అండతో తప్పుడు వివరాలతో ఫారం-7ను దాఖలు చేశారన్నారు. వీటిపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా తొలగించలేదన్నారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని దొంగఓట్లు, మృతుల ఓట్లు, నివాసప్రాంతాల్లో లేని ఓట్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎర్రచందనం స్మగ్లర్లకు కింగ్‌పిన్ చెవిరెడ్డి

- పులివర్తి నాని ఆరోపణ

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లకు కింగ్‌పిన్ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డేనని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని ఆరోపించారు. కలెక్టరేట్ వద్ద శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఫారం-6, 7, 8 కింద దొంగ ఓట్లను మంత్రి అండదండలతో స్థానిక ఎమ్మెల్యే చేర్పించారని విమర్శించారు. దొంగ ఓట్లపై కేంద్ర ఎన్నికల కమిషన్‌ను చంద్రబాబు కలిసి ఫిర్యాదు చేశారన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు కడప, నెల్లూరు జిల్లాల్లో ఎర్రచందనం స్మగ్లర్లకు వైసీపీ అధిష్ఠానం సీట్లను కేటాయించిందని, అలాంటి వారు గెలిచాక ప్రజలకు ఏ విధంగా సేవ చేస్తారో గమనించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లకు కింగ్‌పిన్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి అని, ఆయన ఆధ్వర్యంలోనే ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎన్నికల ఖర్చులకు నిధులను సమకూర్చుతున్నారని విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎర్రచందనం, ఇసుక, మట్టిని దోచుకుని కోట్లాది రూపాయలు అక్రమంగా సంపాదించారన్నారు. చెవిరెడ్డి దేశంలోనే పేరుగాంచిన ఇండస్ట్రీని చంద్రగిరిలో ఏర్పాటు చేస్తున్నారని, అదే గంజాయి పరిశ్రమ అన్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలను బయటపెడతానన్నారు. గతంలో తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో 32వేల దొంగ ఓట్లను చేర్చారని, టీడీపీ, బీజేపీ నాయకుల ఫిర్యాదులతో అప్పట్లో ఈఆర్వోగా ఉన్న గిరీషతోపాటు మరో ముగ్గురిని కూడా కేంద్ర ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసిందన్నారు. దొంగ ఓట్లతో గెలిచిన ఎంపీ గురుమూర్తిని కూడా బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో దొంగ ఓట్లను చేర్పించిన అధికారులతోపాటు వారిపై ఒత్తిడి తీసుకొచ్చిన స్థానిక ఎమ్మెల్యేలపైనా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే సీఎం జగన్.. కోడికత్తి శీనును ఎందుకు బెయిల్‌పై విడుదల చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వందలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలను హతమార్చారని, అలాంటి పార్టీని రానున్న ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ షన్మోహన్‌కు టీడీపీ నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందించారు.

కాణిపాకంలో 22న సీతారాముల కల్యాణం

ఐరాల(కాణిపాకం), జనవరి 19: కాణిపాకంలో ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. అదే రోజున అయోధ్యలో నూతన రామాలయ ప్రతిష్ఠ జరగనుండటంతో ఈ కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ఉభయదారులు, భక్తులు హాజరు కావాలని కోరారు.



ఆలయంలో కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న బి వరాలే - సినీ నటుడు చరణ్‌రాజ్

వరసిద్ధుడి సేవలో కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



యాంకర్ సుమ, గాయని సునీత

ఐరాల(కాణిపాకం), జనవరి 19: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రసన్న బి వరాలే దర్శించుకున్నారు. ఏఈవో హరిమాధవరెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, సీఐ రవిశంకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, వాసు, తహసీల్దార్ సుశీల, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్వామిని సినీనటుడు చరణ్‌రాజ్, యాంకర్ సుమ, ప్రముఖ సింగర్ సునీత దర్శించుకున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు

తిరుమల, జనవరి19(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.74 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 62,649 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,384 మంది తలనీలాలు సమర్పించారు.

గాయపడ్డ నెమలి అటవీ అధికారులకు అప్పగింత



నెమలిని అటటవీశాఖ అధికారులకు అందిస్తున్న కాణిపాకం పోలీసులు

ఐరాల(కాణిపాకం), జనవరి 19: తవణంపల్లె మండలం ఈచనేరి వద్ద గాయపడ్డ నెమలిని గుర్తించిన కొందరు దాన్ని కాణిపాకం పోలీసులకు అందించారు. వారు నెమలికి అవసరమైన చికిత్సలను చేయించాక శుక్రవారం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. అటవీశాఖ అధికారులు ఆ నెమలిని సురక్షితంగా అటవీప్రాంతంలో విడిచిపెట్టారు.

గుండెపోటుతో హెచ్ఎం మృతి



భాష్యం హరి (ఫైల్ ఫొటో)

ఐరాల, జనవరి 19: ఐరాల మండలం నాంపల్లె జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు భాష్యం హరి(52) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం పూతలపట్టు మండలం పోటుకనుమ వద్ద చిగరపల్లె. ఈయన గతంలో బీరప్పచెరువు పాఠశాలలో హెచ్ఎంగా చేస్తూ.. బదిలీపై నాంపల్లె జడ్పీ హైస్కూల్‌కు వచ్చారు. ఉదయం పాఠశాలకు వచ్చి, విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికెళ్లారు. ఇంట్లో ఫోన్ మాట్లాడుతూ ఉన్నట్లుండి కుప్పకూలిపోయారు. గమనించిన కుటుంబీకులు వెంటనే పి.కొత్తకోట ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయం తెలియడంతో చిగరపల్లె, నాంపల్లెల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

చిత్తూరు (సెంట్రల్), జనవరి 19: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమైనట్లు జిల్లా ఒకేషనల్ విద్యాధికారి సయ్యద్ మౌల తెలిపారు. ఫస్టియర్‌కు లాంగ్వేజ్‌తోపాటు సబ్జెక్టుల వారీగా పేపర్-1 ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్‌కు లాంగ్వేజ్‌తోపాటు పేపర్-2 మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. తొలి రోజున తెలుగు, హిందీ పరీక్షలు జరిగాయని పేర్కొన్నారు. శనివారం ఇంగ్లీష్, ఈనెల 22న బోటనీ, మ్యాథ్స్-ఎ, సివిక్స్, 23న మ్యాథ్స్-బి, బయాలజీ, హిస్టరీ, 24న ఫిజిక్స్, ఎకనామిక్స్, 25న కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరగనున్నట్లు వివరించారు.

భీమవరం అడవుల్లో నిమ్మనపల్లి మండలవాసి ఆత్మహత్య



పానిపూరి శివ (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, జనవరి19: చంద్రగిరి మండలం భీమవరం అడవుల్లో అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లి మండలవాసి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. భీమవరం అడవుల్లో ఓ మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పక్కనే ద్విచక్ర వాహనం, పురుగుల మందు డబ్బా ఉంది. పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. వాహన నంబరు ఆధారంగా పోలీసులు నిమ్మనపల్లి మండలానికి చెందిన పానిపూరి శివ(49)గా గుర్తించారు. అయితే ఈనెల 11వ తేదిన పానిపూరి శివ కనిపించడంలేదని నిమ్మనపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయాన్ని చంద్రగిరి పోలీసులు నిమ్మనపల్లి పోలీసులు సమాచారం ఇచ్చారు. శనివారం పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేయనున్నారు.

కఠారి దంపతుల హత్యకేసులో ఇద్దరికి బెయిల్ నిరాకరణ

చిత్తూరు లీగల్, జనవరి 19: దివంగత మేయర్ కఠారి అనురాధ దంపతుల హత్యకేసులో ఇద్దరు నిందితులకు సుప్రీంకోర్టు బెయిల్ నిరాకరించింది. కఠారి అనురాధ, మోహన్‌లు 2015 నవంబరు 17వ తేదీన నగరపాలక సంస్థ కార్యాలయంలో హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై చంద్రశేఖర్ అలియాస్ చింటూతోపాటు మరో 22 మందిపై చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. వీరిలో 18మందికి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. మిగిలినవారు ఇప్పటికీ రిమాండ్‌లో ఉన్నారు. ఇదిలా ఉండగా కొన్నేళ్లుగా తాము జైల్లో ఉన్నామని, బెయిల్ మంజూరు చేయాలంటూ ఇదే కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏ3 జయప్రకాష్ రెడ్డి, ఏ4 మంజునాథ్‌లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు శుక్రవారం విచారణకు వచ్చింది. పూర్వాపరాలు పరిశీలించాక.. కింది కోర్టులో సాక్షుల విచారణ చివరిదశలో ఉన్నప్పుడు బెయిల్ ఇవ్వడం కుదరదంటూ ఆ పిటిషన్‌ను జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ సుధాన్షు ధులియాలు డిస్మిస్ చేశారు.

ఫ్రైడ్ రైస్ తింటూ.. ఊపిరాడక బాలుడి మృతి



నవదీప్ (ఫైల్‌ఫొటో)

వి.కోట, జనవరి 19: వి.కోట మండలం నాగిరెడ్డిపల్లెలో మురళీ కుమారుడు నవదీప్ (11).. ఫ్రైడ్ రైస్ తింటూ, ఊపిరాడక మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. పీలేరు సమీపంలోని గ్యారెంపల్లె గురుకులంలో ఆరో తరగతి చదువుతున్న నవదీప్ సంక్రాంతి సెలవులకు స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం తనకు ఫ్రైడ్ రైస్ కావాలని తండ్రిని అడిగాడు. ఆయన వి.కోట నుంచి ఫ్రైడ్‌రైస్‌ను తీసుకురాగా, దాన్ని తింటుండగా గొంతుపట్టుకుని.. ఊపిరాడక అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే కారులో వి.కోటకు బయల్దేరారు. మార్గమధ్యంలోనే వాంతులు చేసుకుటూ విలవిల్లాడాడు. ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు ఆ గ్రామానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబీకులను ఓదార్చారు.

బిగుస్తున్న ఉచ్చు

దొంగ ఓట్ల కేసులో మరో ఇద్దరిపై సస్పెన్షన్ వేటు

బోగస్ ఓట్ల వెనుక గుర్తు తెలియని వ్యక్తులున్నారంటూ కమిషనర్ ఫిర్యాదు

ఫిర్యాదులో ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్ల పేర్లు

అసలు సూత్రధారుల పేర్లు బయటకు రాకుండా భారీ ప్రయత్నాలు



సస్పెండైన తిరుపతి కలెక్టరేట్ ఏవో ఎం.జయరాములు, విజయభాస్కర్

తిరుపతి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి దొంగ ఓట్ల కుంభకోణంలో డొంక కదులుతోంది. తొలి వేటు ఐఏఎస్ అధికారి గిరీషా మీద పడగా మలి వేటు ఒక తహసీల్దారు, మరొక డిప్యూటీ తహసీల్దారు మీద పడింది. తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల విధుల్లో ఉన్న మిగిలిన అధికారుల మీద కూడా చర్యలు తప్పవనే ప్రచారం జరుగుతోంది.అయితే అసలు సూత్రధారుల పేర్లు బయటకు రాకుండా ఉండేందుకు అప్పుడే ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నట్టు చెబుతున్నారు. అందులో భాగంగానే ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్ల మీద పోలీసులకు ఫిర్యాదు చేశారని భావిస్తున్నారు. మరోవైపు వైసీపీ నేతల ఆదేశాలకు అనుగుణంగా విచ్చలవిడిగా ఉప ఎన్నికల విధులు నిర్వహించిన పోలీసు అధికారులు ఎన్నికల కమిషన్ కొరడా తమ మీదకు మళ్లకముందే సర్దుబాటు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉప ఎన్నికల్లో తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో వున్న మూడు అసెంబ్లీ నియోజకవర్గాలైన తిరుపతికి ఆర్వోగా మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఏఆర్వోగా అర్బన్ తహసీల్దార్ జయరాములు, శ్రీకాళహస్తి ఆర్వోగా గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు (జీఎన్ఎస్ఎస్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. శ్రీనివాస్, సత్యవేడు ఆర్వోగా డ్వామా పీడీ చంద్రశేఖర్ వ్యవహరించారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ గిరీష ఈఆర్వోగా ఉన్నారు. ఆ సమయంలో ఈఆర్వో లాగిన్ నుంచి దాదాపు 34వేల ఎపిక్ కార్డులు డౌన్‌లోడ్ చేసి దొంగ ఓటరు కార్డులను సృష్టించినట్టు ఈసీ గుర్తించింది. దేశంలోనే అతిపెద్ద ఎన్నికల నేరంగా భావించి వెంటనే చర్యలకు ఉపక్రమించింది.ఈఆర్వోగా వ్యవహరించిన ప్రస్తుత అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషాను సస్పెండ్ చేసింది. ఆ తర్వాతి వేటు ఉప ఎన్నికల సమయంలో ఏఆర్వోగా పనిచేసి ప్రస్తుతం కలెక్టరేట్‌లో ఏవోగా ఉన్న అర్బన్ తహసీల్దార్ జయరాములు మీదా, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసి, ప్రస్తుతం పుత్తూరు డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న ఎం. విజయభాస్కర్‌లపై పడింది. ఈ ఇద్దరినీ కేంద్ర ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. అప్పట్లో ఎన్నికల విధుల్లో ఉన్న మిగిలినవారి మీద కూడా తదుపరి చర్యలుంటాయనే ప్రచారం జరుగుతోంది. అప్పటి ఆర్డీవో కనకనరసా రెడ్డి పైన కూడా చర్యలు తప్పవనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే ఉప ఎన్నిక ఓట్ల అవకతవకలతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన మీడియాకు వివరణ ఇచ్చుకున్నారు. అదేవిధంగా తిరుపతికి ఆర్వోగా పనిచేసిన మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డిపై కూడా త్వరలో వేటు పడనున్నట్టు అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది.

చిట్టెలుకలను ఇరికించే కుట్రా?

ఇదిలావుంటే ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఒరిజనల్ ఎపిక్ (ఎలక్షన్ ఫొటో ఐడెంటిటీ)కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేసి, వాటి స్థానంలో నకిలీ ఎపిక్ కార్డులు రూపొందించారంటూ ఈనెల 7వ తేదీన తిరుపతి ఈస్టు పోలీసులకు కార్పొరేషన్ కమిషనర్ హరిత ఫిర్యాదు చేయడం చర్చగా మారింది.ఆ సమయంలో తిరుపతి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లు ప్రతాప నాయక్, సి.శివకుమార్, జి. విజయకుమార్‌లను ప్రాథమికంగా తాను విచారించానని, అయితే వారు తమ పాత్ర ఉన్నట్టు అంగీకరించలేదని హరిత ఫిర్యాదులో పేర్కొన్నారు.సాంకేతికపరమైన పరిజ్ఞానంతో లోతైన విచారణ చేపట్టాలని ఆమె కోరారు కూడా. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఐటీ చట్టం మేరకు విచారణకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. అయితే ఇదంతా కిందిస్థాయి ఉద్యోగులను బలిపశువులుగా చేసే కుట్రగా కనిపిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం ముగ్గురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 34 వేల కార్డులను తమకై తాము డౌన్‌లోడ్ చేసేంత సాహసం ఎందుకు చేసి ఉంటారనే ప్రశ్న బలంగా వినిపిస్తోంది. వీరికి పై అధికారుల నుంచి ఒక వేళ ఆదేశాలున్నా.. రాజకీయ నేతల ప్రమేయం లేకుండా ఇదంతా జరిగే అవకాశమే లేదంటున్నారు. తిరుపతి కేంద్రంగా ప్రముఖ రాజకీయ నేతల కార్యాలయంలో ఈ దొంగ వ్యవహారం అంతా జరిగిందనే ప్రచారం నేపథ్యంలో.. దృష్టి మళ్లించడానికే ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్ల పేర్లతో హడావుడిగా ఫిర్యాదు చేశారని అంటున్నారు. ఎన్నికలు ముంచుకు వస్తున్న వేళ ప్రజల అనుమానాలు తమ మీదకు మళ్లకుండా ముఖ్య నేతలు భారీస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారని చెబుతున్నారు.

ప్లీజ్.. ప్లీజ్ .. సంతకం పెట్టండి : పోలీసుల వేడుకోలు

ఇదే సమయంలో ఉప ఎన్నికల విధులు నిర్వహించిన పోలీసు అధికారుల గుండెల్లో గుబులు మొదలైంది. తిరుపతి ఉప ఎన్నికల్లో జరిగిన అవకతవకలపై తనకేమీ సంబంధం లేదన్నట్టుగా సంతకం చేయమంటూ అప్పటి అలిపిరి సీఐ దేవేంద్రకుమార్ టీడీపీ ఎంపీ అభ్యర్థి పనబాక లక్ష్మిని గురువారం కోరినట్టు చెబుతున్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నివాసంలో మీడియా సమావేశంలో పనబాక లక్ష్మి ఉండగా సీఐ అక్కడకు చేరుకుని అభ్యర్థించారని చెబుతున్నారు. ఉప ఎన్నికల వేళ దొంగ ఓట్లు వేసినవారిపై ఆధారాలతో సహా పనబాక లక్ష్మి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆమె ఫిర్యాదులో పేర్కొన్నవారు తమ విచారణలో అసలైన ఓటర్లు అని తేలిందని అంగీకరిస్తున్నట్టు సంతకం పెట్టాలని సీఐ ఆమెను కోరారని తెలుస్తోంది. దీనిపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఆమె, సంతకం పెట్టకుండా తిప్పి పంపారంటున్నారు. ఇక మరి కొందరు పోలీసు అధికారులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వద్దకు పరుగులు తీసినట్టు చెబుతున్నారు. ఎలాగైనా తమను కాపాడాలంటూ వేడుకున్నారని అంటున్నారు. ఆయన మాత్రం, కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల విషయంలో తానేమీ జోక్యం చేసుకోలేనని తేల్చి చెప్పేశారని తెలుస్తోంది. దీంతో నాయకుల ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించిన పోలీసులు తల్లడిల్లుతున్నట్టు చెబుతున్నారు.

ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు రామచంద్రయాదవ్

వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించిన హైకోర్టు

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ధర్మ పోరాట సభ ఏర్పాటు ఘటనలో పుంగనూరు పోలీసులు తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని న్యాయస్థానం పోలీసులను ఆదేశించింది. విచారణను వారం రోజుల పాటు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగడం సుమతి శుక్రవారం ఆదేశాలు ఇచ్చారు.

ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్‌గా చాముండేశ్వరి



చిత్తూరు (సెంట్రల్), జనవరి 19: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా ఎ.చాముండేశ్వరీ నియమితులయ్యారు. కర్నూలు జిల్లా సమగ్రశిక్షలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఈమెకు ఏడీ పదోన్నతి కల్పిస్తూ ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా నియమిస్తూ చిత్తూరుకు బదిలీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు ఇన్‌చార్జిగా వ్యవహరించిన పరీక్షల విభాగం సహాయ కమిషనర్ గురుస్వామిరెడ్డి తన విభాగానికే పరిమితం కానున్నారు.

ఆర్డీవో ముందు హాజరుకండి నోటీసుపై మీ అభ్యంతరాలు చెప్పండి

బీసీవైపీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్‌కు హైకోర్టు ఆదేశం

24 వరకు ఆయనపై ఎలాంటి కఠినచర్యలు తీసుకోవద్దు

ఆర్‌డీవో, పుంగనూరు ఎస్‌హెచ్‌వోకు స్పష్టీకరణ

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తన ముందు హాజరు కావాలని కోరుతూ సీఆర్పీసీ సెక్షన్ 110 కింద పలమనేరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఇచ్చిన నోటీసును సవాల్ చేస్తూ భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. రామచంద్రయాదవ్‌పై ఈ నెల 24 వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆర్‌డీవో, పుంగనూరు ఎస్‌హెచ్‌వోను ఆదేశించింది. అయితే ఆర్‌డీవో ముందు హాజరై నోటీసులు ఇవ్వడంపై అభ్యంతరాలు తెలియజేయాలని పిటిషనర్‌కు సూచించింది. విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగడం సుమతి శుక్రవారం ఆదేశాలిచ్చారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎన్.అశ్వనీకుమార్ వాదనలు వినిపించారు. కేవలం రాజకీయ కక్షతో పిటిషనర్‌కు సీఆర్పీసీ సెక్షన్ 110 కింద నోటీసులు జారీ చేశారన్నారు. సంబంధిత సెక్షన్ కింద నోటీసు ఇవ్వడానికి గల కారణాలను అందులో పేర్కొనలేదన్నారు. పిటిషనర్‌ను అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉందన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ... ఈ నెల 20న విచారణకు హాజరు అవుతాన ని పిటిషనర్ సమాచారం ఇచ్చారన్నారు. నోటీసుపై పిటిషనర్ తన అభ్యంతరాలను ఆర్డీవో ముందు వ్యక్తపరచవచ్చన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.... ఆర్‌డీవో ముందు హాజరై నోటీసులు ఇవ్వడంపై అభ్యంతరాలు తెలియజేయాలని పిటిషనర్‌కు సూచించింది. ఈ నెల 24 వరకు పిటిషనర్‌పై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ఆర్‌డీవో, పుంగనూరు ఎస్‌హెచ్‌వోను ఆదేశించారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

మహిళ అరెస్టు



నిందితురాలి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

చిత్తూరు, జనవరి 19: ఆరు కిలోల గంజాయిని ఒకటో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకుని, ఓ మహిళను అరెస్టు చేశారు. వివరాలను సీఐ ఉలసయ్య మీడియాకు తెలిపారు. రహస్య సమాచారంతో శుక్రవారం కట్టమంచి ఆటోస్టాండ్ వద్ద పెనుమూరు మండలం పూనేపల్లికి చెందిన షాహీనా(35)ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమె వద్ద నుంచి ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈమె వైజాగ్ నుంచి కొంతమంది వ్యక్తుల ద్వారా గంజాయిని కొనుగోలు చేస్తోంది. తర్వాత దాన్ని చిత్తూరులోని ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, పాతబస్టాండు, గంగినేనిచెరువు, పీవీకేఎన్ కళాశాల తదితర ప్రాంతాల్లో అధిక ధరలకు అమ్ముతున్నట్లు విచారణలో గుర్తించారు. దాంతో నిందితురాలిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్ఐలు మల్లికార్జున్, భారతి పాల్గొన్నారు.

పుంగనూరులో సినీ సంక్రాంతి



విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న సినీనటి తమన్నా

పుంగనూరు, జనవరి 19: వచ్చే ఏడాది సంక్రాంతి పండుగకు పుంగనూరుకు వచ్చి అందరినీ కలిసి సంస్కృతి, సంప్రదాయాలు పూర్తిగా తెలుసుకుంటానని ప్రముఖ సినీనటి తమన్నా అన్నారు. పుంగనూరుకు శుక్రవారం తమన్నా రావడంతో పట్టణంలో సందడి నెలకొంది. బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేయగా.. బహుమతులను యాంకర్ సుమ, సినీగాయని సునీతలతో కలిసి తమన్నా ప్రదానం చేశారు.


వచ్చే ఏడాది భారీగా నిర్వహిస్తాం రామచంద్రయాదవ్

భగవంతుడు ఆశీర్వదిస్తే వచ్చే ఏడాది సంక్రాంతి సంబరాలను రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా భారీ ఎత్తున పుంగనూరులో నిర్వహిస్తామని రామచంద్ర యాదవ్ తెలిపారు. వచ్చే ఏడాదిలో మహిళలకు ముగ్గుల పోటీలు, రైతులకు ఎద్దుల పోటీలు, యువతకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని వివరించారు.

భారీగా విజేతలకు బహుమతులు

పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలు, మున్సిపాలిటీలతో కలిపి మొదటి బహుమతిగా ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.50,116 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. వీరిలో.. పుంగనూరు టౌన్ నుంచి ఆర్.వసంతకుమారి, పుంగనూరు మండలం నుంచి జె.లోహిత, చౌడేపల్లె మండలం నుంచి ఆర్.కుసుమ, సోమల మండలం నుంచి చిన్నరెడ్డెమ్మ, సదుం మండలం నుంచి డి.అనసూయ, పులిచెర్ల మండలం నుంచి ఎం.హేమలత, రొంపిచెర్ల మండలం నుంచి రెడ్డిరేణుక ఉన్నారు. ద్వితీయ బహుమతులుగా మండలానికి ముగ్గురు చొప్పున మొత్తం 21మందికి రూ.25,116, తృతీయ బహుమతిగా మండలానికి తొమ్మిది మంది చొప్పున మొత్తం 63మందికి రూ. 5,116 చొప్పున నగదు అందజేశారు. అలాగే పోటీలో పాల్గొన్న 400 మంది మహిళలకు సంక్రాంతి ప్రత్యేక కానుకలు అందించారు. బీసీవైపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

డీసీసీబీలో వడ్డీపై వడ్డీ మాఫీ



సమావేశంలో ప్రసంగిస్తున్న రెడ్డెమ్మ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 19: రైతులు తీసుకున్న రుణాలు వాయిదా మీరి ఉంటే వాటిని మార్చి నెలాఖరులోగా చెల్లిస్తే వడ్డీపై వడ్డీ, అపరాధపు వడ్డీ మాఫీ, వడ్డీ రాయితీ పొందే సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ఛైర్‌పర్సన్ రెడ్డెమ్మ ప్రకటించారు. స్థానిక బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె ప్రసంగించారు. వడ్డీ మాఫీ కారణంగా బ్యాంకుపై రూ.కోటి అదనపు భారం పడుతుందని, రైతాంగం కోసం దాన్ని మోసేందుకు సిద్ధమన్నారు. రూ.వెయ్యి కోట్ల డిపాజిట్లు సేకరించాలన్న లక్ష్యంలో ఇంతవరకు రూ.850 కోట్లు వృద్ధి సాధించామని చెప్పారు. సీఈవో మనోహర్ గౌడ్ అజెండాలోని అంశాలను సభ్యులకు వివరించారు. బ్యాంకు పరిధిలోని ఉద్యోగుల సర్వీసు రెగ్యులరైజేషన్ అమలు చేయాలని పాలకవర్గం నిర్ణయించిందన్నారు. రైతాంగం నుంచి వస్తున్న అభ్యర్థనలతో సింగిల్ విండోల ద్వారా ఇస్తున్న రుణపరపతిని మరింత పెంచుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు, సీడీసీఎంఎస్ అధ్యక్షులు నాగలక్ష్మి, ప్రింటింగ్ ప్రెస్ అధ్యక్షుడు మురళీమోహన్ రెడ్డి, డీసీవో బ్రహ్మానందరెడ్డి, డీఎల్‌సీవో వనజ, సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జి కమిటీ అధ్యక్షులు, బ్యాంకు, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

టీటీడీ డిగ్రీ కళాశాలలకు స్వయం ప్రతిపత్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 19 : టీటీడీ తిరుపతిలో నిర్వహిస్తున్న మూడు డిగ్రీ కళాశాలలు స్వయం ప్రతిపత్తి (అటానమస్ స్టేటస్) పొందినట్లు జేఈవో సదాభార్గవి వెల్లడించారు. తిరుపతి పద్మావతి గెస్ట్ హౌస్‌లో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, పద్మావతి డిగ్రీ కాలేజీ, ఎస్జీఎస్ కాలేజీలకు యూజీసీ పదేళ్ల పాటు అటానమస్ హోదా కల్పించిందన్నారు. టీటీడీ పాటిస్తున్న విద్యా ప్రమాణాల వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ హోదాతో కళాశాలల అభివృద్ధి, ప్రమాణాలు, స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడానికి మరింత అవకాశం కలుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు సిలబస్‌లో మార్పు చేర్పులు చేసుకుంటూ విద్యార్థులకు ఉన్నత ఉపాధి అవకాశాలు దక్కించుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం స్వయం ప్రతిపత్తి హోదా పొందిన మూడు డిగ్రీ కాలేజీలు న్యాక్ గ్రేడింగ్ కూడా గతంలోనే పొందినట్టు చెప్పారు. ఈ సమావేశంలో టీటీడీ డీఈవో భాస్కర్‌రెడ్డి, టీటీడీ విద్యా సలహాదారు డాక్టర్ ఎల్ఆర్ మోహన్‌కుమార్‌రెడ్డి, టీటీడీ చీఫ్ పీఆర్వో డాక్టర్ టి.రవి, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. టీటీడీ డిగ్రీ కాలేజీలు స్వయం ప్రతిపత్తి హోదా పొందడం పట్ల టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

తిరుపతికి వెల్‌నెస్ సెంటర్ మంజూరు

తిరుపతి (రవాణా), జనవరి 19: తిరుపతికి వెల్‌నెస్ సెంటర్ మంజూరైంది. కేంద్ర ప్రభుత్వ వర్కింగ్, విశ్రాంత ఉద్యోగులకు తిరుపతిలో ఆరోగ్య కేంద్రం లేదు. సెంట్రల్ గవర్నమెంట్ రిటైర్డ్ అండ్ సర్వింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ కోఆర్డినేషన్ కన్వీనర్లు దామోదరం, రంగయ్య సహకారంతో హెల్త్ కేంద్రం ఏర్పాటు ఆవశ్యకత గురించి ఎంపీ గురుమూర్తి కేంద్ర ప్రభుత్వంతో పలు దఫాలు చర్చించారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్‌స్కీమ్ (సీజీహెచ్ఎస్) కింద వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. భవనాల పరిశీలనకు హైదరాబాద్ నుంచి సీజీహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్ లక్ష్మయ్య బృందం తిరుపతికి చేరుకుంది. నగరంలోని బీఎస్ఎన్ఎల్, పద్మావతి ఆస్పత్రి, రుయా, ఈఎస్ఐ ఆస్పత్రులను పరిశీలించింది. ఉన్నతాధికారులతో చర్చించి ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో కేంద్ర ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య పరీక్షల కోసం బెంగళూరు, చెన్నై తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండాపోతుంది.

బోయకొండలో రాహుకాల పూజలు


ప్రత్యేకాలంకారంలో గంగమ్మ, క్యాలెండర్ అవిష్కరిస్తున్న ఈవో

చౌడేపల్లె, జనవరి 19: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి భక్తులకు అన్నదానం నిర్వహించారు. చిత్తూరు ప్రింటింగ్ ప్రెస్ ఛైర్మన్ మురళి ముద్రించిన బోయకొండ గంగమ్మ క్యాలెండర్లను ఈవో చంద్రమౌళి అవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ సభ్యుడు రాయల్ మోహన్ పాల్గొన్నారు.

'రా..కదిలిరా'ను విజయవంతం చేద్దాం : చల్లా


బహిరంగసభ స్థలాన్ని పరిశీలిస్తున్న చల్లాబాబు, కిషోర్‌కుమార్‌రెడ్డి

రొంపిచెర్ల, జనవరి 19: ప్రతిపక్షనేత చంద్రబాబు చేపట్టిన రా..కదిలిరా కార్యక్రమానికి కదలి రావాలని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పీలేరు నియోజకవర్గం బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డితో కలిసి పీలేరు మదనపల్లె రోడ్డున ఏర్పాటు చేస్తున్న సభాస్థలం పనులను పరిశీలించారు. ఏర్పాట్లు, జన సమీకరణ వంటి విషయాలు చర్చించుకున్నారు. అనంతరం చల్లాబాబు రొంపిచెర్లలో మీడియాతో మాట్లాడుతూ ఈనెల 20, 21వ తేదీల్లో చౌడేపల్లి మండలంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో మండలపార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, నాయకులు నాగార్జున నాయుడు, అమరనాథ రెడ్డి, నాగిశెట్టి నాగరాజ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

కల్లూరు, జనవరి 19: పులిచెర్ల మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ రాజశేఖర్, ఎంఈఓ సిద్దరామయ్య సూచించారు. పులిచెర్ల ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ర్యాంపులు, నీటివసతి, మరుగుదొడ్లు, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, లైటింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

పోలింగ్ బూత్‌ల సమస్యలపై సమీక్ష

రొంపిచెర్ల, జనవరి 19: మండలంలోని పోలింగ్ స్టేషన్లలో సమస్యలపై శుక్రవారం తహసీల్దార్ అమరనాథ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో 27 పోలింగ్ బూతులున్నాయి. వీటిలో బొమ్మయ్యగారిపల్లె, బండకిందపల్లె పంచాయతీల్లో జాతీయ రహదారి విస్తరణతో పాఠశాల భవనాల సమస్య, చల్లంపల్లె, గుండ్లూరువారిపల్లె, వంకమద్దివారిపల్లె, చల్లంపల్లె, జాండ్లవారిపల్లె పోలింగ్ స్టేషన్లలో ర్యాంపులు, విద్యుత్, తాగునీరు వంటి సమస్యలు ఉన్నట్లు తహసీల్దార్‌కు తెలిపారు. ఈనెల 25లోపు పరిష్కార చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈసమావేశంలో ఎంపీడీవో రాజేంద్ర, ఎంఈవో శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



గంగవరం, జనవరి 19: వి.కోట మండలం కస్తూరి నగరంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ యల్లయ్య తెలిపారు. శుక్రవారం పలమనేరు ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో పట్టుబడిన మహిళను అరెస్ట్ చూపి వివరాలను సీఐ వెల్లడించారు. కస్తూరి నగరం వద్ద తనిఖీల్లో అదే ప్రాంతానికి చెందిన సుశీల పట్టుబడగా 480 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. సుశీలపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు సీఐ తెలిపారు. కాగా ఈ కేసులో ఇదే గ్రామానికి చెందిన పరిమళ హస్తం కూడా ఉన్నట్లు తేలడంతో, త్వరలోనే ఆమెను కూడా అరెస్ట్ చేస్తామని ఎక్సైజ్ సీఐ తెలిపారు.

ఆడుదాం ఆంధ్ర విజేతలకు బహుమతుల పంపిణీ



గంగవరం, జనవరి 19 : పలమనేరు మండలంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో గెలుపొందిన విజేతలకు శుక్రవారం మండల అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల క్రీడామైదానంలో శుక్రవారం కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో పోటీల ఫైనల్స్ నిర్వహించారు. కబడ్డీలో మండిపేట కోటూరు పంచాయతీ టీమ్ విజేతగా నిలిచిందన్నారు. అలాగే క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో పోటీలలో గెలుపొందిన టీములకు కమిషనర్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ విద్యాసాగర్, ఎంఈఓ బాలసుందరం, ఈఓఆర్డీ గిరధర్ బహుమతులు ప్రదానం చేసి, క్రీడా సామగ్రి పంపిణీ చేశారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చారిత్రాత్మక ఘట్టం


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జడ్పీ ఛైర్మన్, ఎమ్మెల్యే

గంగవరం, జనవరి 19 : విజయవాడలో రూ.400 కోట్లతో చరిత్రలో నిలచిపోయేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం అవిష్కరించడం శుభపరిణామమని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. 206 అడుగుల అంబేడ్కర్ మహాశిల్పం విజయవాడలో ఆవిష్కరణ సందర్భంగా వారిద్దరూ పలమనేరులోని మదనపల్లె రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్వీ సుభాష్‌చంద్రబోస్, ఏఎంసీ ఛైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు మండీసుధ, నయాజ్, కేఎం నాగరాజు, హేమంత్, కిరణ్, శ్యామ్ పాల్గొన్నారు.

మినీ రైల్వే ఓవర్ బ్రిడ్జి స్థల పరిశీలన


డీఆర్‌ఎంకు వినతి పత్రం అందజేస్తున్న భరత్

కుప్పం, జనవరి 19: కుప్పం పట్టణంలో రెండు ప్రధాన ప్రాంతాల మధ్య రాకపోకల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం మినీ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం స్థలాన్ని శుక్రవారం డీఆర్‌ఎం యోగేష్‌మహేష్ సందర్శించారు. పట్టణంలో 101 గేటు మూసివేత వల్ల ప్రజలు, విద్యార్థులు పడుతున్న అవస్థలను ఎమ్మెల్సీ భరత్, సాయిమాత సేవా ట్రస్టు ఛైర్మన్ జగదీష్‌బాబు ఆయన దృష్టికి తెచ్చారు. 101 గేట్ మీదుగానే మినీ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని వారు ఆయనకు వినతిపత్రం కూడా అందజేశారు. దీనిపై స్పందించి డీఆర్‌ఎం బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.5కోట్లు ఖర్చవుతుందని, ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే అనుమతుల మంజూరుకు రైల్వే ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గంగవరం : పలమనురు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పలమనేరు టౌన్, రూరల్‌ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ చిన్నబ్బ ఓ ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఆకలి మంటల పోరాటం ఆగదు

కొనసాగుతున్న అంగన్వాడీల దీక్షలు


కుప్పంలో దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు, పలమనేరు, బైరెడ్డిపల్లెలలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్వాడీ సంఘు నేతలు

కుప్పం, జనవరి 19: తమ ఆకలి మంటల పోరాటం ఆగదని కుప్పం అంగన్వాడీలు స్పష్టం చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేస్తున్న దీక్షలు 39వ రోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు లలిత మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం వంటి న్యాయమైన డిమాండ్ల సాధనకోసం 40 రోజులుగా దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. కాగా దీక్షలు కొనసాగుతుండగా, అంగన్వాడీ కార్యకర్త ఒకరు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఆమెను తోటి అంగన్వాడీలు ఆసుపత్రికి తరలించారు.

గంగవరం : రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె ఆపే ప్రసక్తే లేదని అంగన్వాడీ సంఘ నేతలు తేల్చిచెప్పారు. అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరుకుంది. శుక్రవారం అంగన్వాడీ ఉద్యోగులు, సంఘ నేతలు పలమనేరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నుంచి గుడియాత్తంరోడ్డు, ఎంబీటీ రోడ్డు గుండా మదనపల్లె రోడ్డు సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమే ధ్యేయంగా పనిచేసి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ గిరిధర్ గుప్త, ఓబులరాజు, ఏఐటీయూసీ లక్ష్మి, రాధ, పలువురు సంఘ నేతలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె : అంగన్వాడీల నిరవధిక సమ్మె 39వ రోజుకు చేరుకుంది. శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తలు బైరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద బీఆర్, అంబేడ్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ సమస్యలపై సానుకూలంగా స్పందించాలని వారు డిమాండ్ చేశారు. కాగా అంగన్వాడీల సమ్మెకు మండలంలోని ఉపాధ్యాయ సంఘ నాయకులు ప్రకాష్, వినోద్, శశికుమార్, నాగభూషణం, మోహన్, నాగరాజు, వెంకటేష్ తదితరులు మద్దతు తెలిపి రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు.

మామిడి తోటల్లో కానరాని పూత


సోమలలో పూత రాని మామిడి తోట

సోమల, జనవరి 19: సోమల మండలంలోని మామిడి తోటల్లో పూత రాకపోవడంలో రైతులు ఆందోళన పడుతున్నారు. గత ఏడాది డిసెంబరు నెలలోనే పూత రాగా ఈ ఏడాది జనవరి నెల పూర్తి అవుతున్నా తోటల్లో పూత లేకపోవడంతో మందుల పిచికారీ చేస్తున్నారు. మామిడి తోటల్లో పూత రావడానికి కనీసం 30 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండాలని ఉద్యానాధికారులు తెలుపుతున్నారు. చల్లని వాతావరణం, వీడని మంచుతో పూత రావడానికి జాప్యం జరుగుతోంది. పూతను చూసి వ్యాపారులు తోటలు లీజుకు ముందుకు వచ్చేవారు. ప్రస్తుతం వ్యాపారులు వెనుకడుగు వేస్తున్నారు. సోమల మండలంలోని సోమల, పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె, కందూరు, నెల్లిమంద, నడింపల్లె, నంజంపేట పంచాయతీల్లో 6వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు 25డిగ్రీలకు మించడం లేదు. ఇదే సమయంలో రైతులు ట్రాక్టరు ద్వారా రసాయనిక మందులు పిచికారీకి చర్యలు చేపట్టారు. పిచికారీ ఖర్చులు ఎకరానికి రూ. 7 వేలు ఖర్చు చేస్తున్నారు. రసాయనిక మందుల ధరలు పెరిగాయి. ఉద్యానాధికారులు చొరవ తీసుకుని రాయితీలో పిచికారీ మందులు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

నాణ్యమైన వస్తువుల వినియోగంతోనే విద్యుత్ ఆదా



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

పుంగనూరు, జనవరి19: నాణ్యమైన వస్తువుల వినియోగంతో విద్యుత్‌ను ఆదా చేయవచ్చునని విద్యుత్ ఎస్ఈ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో విద్యుత్ పొదుపుపై రెండవ రోజు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్రిజ్‌లు, ఏసీలు, కూలర్లు తదితర వస్తువులు కొనుగోలు చేసే సమయంలో నాణ్యమైనవి ఎంచుకుంటే విద్యుత్‌ను ఆదా చేయవచ్చు అన్నారు. తక్కువ ధరలు కలిగిన వస్తువులు కొనుగోలు చేయడం వల్ల విద్యుత్ వినియోగం పెరుగుతుందన్నారు. బొగ్గు వినియోగించడం వల్ల కాలుష్యం పెరుగుతున్నట్లు తెలిపారు. సూర్య కాంతితో విద్యుత్ తయారు చేసుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర విద్యుత్ వినియోగ మిషన్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, జానపద కళలసంస్థ రాష్ట్ర ఛైర్మన్ నాగభూషణం, మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఈఈ శ్రీనివాసమూర్తి, డీఈఈ రవి, మహేశ్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో మున్సిపాలిటీకి ఆదాయం


సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పుంగనూరు, జనవరి19: పట్టణ సమీపంలోని సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్ వద్ద విద్యుత్ తయారీకి ఏర్పాటు చేస్తున్న సోలార్‌ను మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని తాగునీరు మోటర్లు, వీధిలైట్లు వెలిగించడానికి విద్యుత్ బిల్లులు అధికంగా వస్తుండటంలో దానిని తగ్గించడానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు పట్టణ సమీపంలో సోలార్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే పట్టణంలోని గోకుల్ సర్కిల్, పుంగమ్మ చెరువుకట్టపైన, ఎల్ఐసీ కాలనీ ప్రాంతాల్లో పార్కులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ మహేశ్, జానపద కళలసంస్థ రాష్ట్ర ఛైర్మన్ నాగభూషణం, కౌన్సిలర్లు కాళిదాసు, అమ్ము, పట్టణ పార్టీ అధ్యక్షుడు జయరాం తదితరులు పాల్గొన్నారు.

వేమన పద్యాలు తెలియని తెలుగువారుండరు


యోగి వేమన విగ్రహానికి నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘు నేతలు

గంగవరం, జనవరి 19 : తెలుగు ప్రజలు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా వేమన పద్యాలు తెలియన వారు ఉండరనడంలో సందేహం లేదని తెలుగుసాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం యోగి వేమన జయంతిని పురస్కరించుకుని పలమనేరు సమీపంలోని యోగి వేమన విగ్రహానికి రెడ్డి సంఘ నాయకులు, ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తులసీనాథం మాట్లాడుతూ వేమన పద్యాలు సమాజాన్ని ప్రభావితం చేసేలా ఉంటాయన్నారు. అనంతరం వేమన పద్యాలతోపాటు 100కుపైగా పద్యాలను పాడిన గంగవరం మండలం కు చెందిన డింపుల్, లక్కీ, పిణిత అనే విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ప్రముఖ కవులు మల్లెల నాగరాజు, చంద్రశేఖరయ్య, ప్రసన్నలక్ష్మి, జయలక్ష్మిలను సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘ నాయకులు అమర్నాథ రెడ్డి, వెంకట్రమణారెడ్డి, కిషోర్, నాగరాజురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రంగనాథ్, జయరామిరెడ్డి, మల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను నెలాఖరుకు పూర్తిచేయండి

చిత్తూరు, జనవరి 19: పూణేపల్లె వద్ద నిర్మిస్తున్న టిడ్కో గృహ సముదాయాలను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని కమిషనర్ అరుణ టిడ్కో అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆమె టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించారు. ఎలక్ట్రికల్, శానిటేషన్, రోడ్లు, మురుగుకాల్వల పనులను పరిశీలించారు. మొత్తం 2832గృహాలను సిద్ధం చేసినట్లు వివరించారు.

విద్యార్థిని అదృశ్యం

చిత్తూరు, జనవరి 19: పరీక్ష రాసేందుకు చిత్తూరుకు వచ్చిన ఓ విద్యార్థిని తిరిగి ఇంటికి రాకపోవడంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. బంగారుపాళ్యం మండలం తుంబకుప్పం గ్రామానికి చెందిన కుసుమ (18) చిత్తూరులో పీసీఆర్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. శుక్రవారం సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు వచ్చింది. తిరిగి ఇంటికి చేరలేదు. దాంతో తల్లి మమత ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు రూరల్, జనవరి19: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ పూల ప్రేమ్‌కుమార్ పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, కొత్తయిండ్లు ప్రాంతాల్లో ప్రజలకు కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద కుటుంబాలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లడానికి ఆయుష్మాన్‌భారత్, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, ముద్రలోన్లు, పీఎం స్వానిధియోజన, ప్రధానమంత్రి ఉపాధి కల్పన, స్వచ్ఛభారత్ మిషన్, ప్రధానమంత్రి ఉజ్వలయోజన తదితర పథకాలను అమలు చేస్తున్నట్లు ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నానబాలకుమార్, పెద్దమరంబాబు, మల్లికారాణి, మంజునాథ్, ఆదినారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బంగారుపాళ్యం, జనవరి 19: చెన్నై -బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలి వద్ద గల శ్రీని ఫుడ్ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు .. బైరెడ్డిపల్లి మండలం చింతలగుట్టకు చెందిన కార్తీక్ కుమారుడు శివ, రెహమాన్ కుమారుడు అక్రమ్ తమ స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. పలమనేరు నుంచి శ్రీని ఫుడ్ ఫ్యాక్టరీకి వెళ్లేందుకు ఈషర్ వాహనం మలుపు తిరుగుతూ ద్విచక్రవాహన దారులను ఢీకొంది. శివ, అక్రమ్‌లకు తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శివ (18) మృతిచెందాడు. ఏఎస్ఐ మల్లప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించండి: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 19: చిరుధాన్యాల సాగును మరింత ప్రోత్సహించాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ జిల్లాలో రాగిపంట ఉత్పత్తికి మరింత అవకాశాలు ఉన్నాయన్నారు. మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉద్యానశాఖ అధికారులు మామిడిలో సస్యరక్షణ పద్ధతులపై అవగాహన సమావేశాలు ఏర్పాటుచేసి రైతులు ఎగుమతుల ద్వారా మంచి ధర పొందేలా చేస్తున్నట్లు ప్రకటించారు. పీఎంకే ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్‌మాట్లాడారు.

లక్ష్మీనరసింహుడికి అభిషేక పూజలు



కల్లూరు, జనవరి 19: పులిచెర్ల మండలం దేవళంపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధరకాల పుష్పాలతో అలంకృతుడైన లక్ష్మీనరసింహస్వామి భక్తులకు విశేషంగా దర్శనమిచ్చారు. ఉభయదారులుగా మిట్టమీదరాచపల్లెకు చెందిన మునిరెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు.

చెరువుకోన వద్ద ఒంటరి ఏనుగు సంచారం

సోమల, జనవరి 19: మండలంలో మూడు రోజులుగా సంచరిస్తున్న ఒంటరి ఏనుగు గురువారం రాత్రి చెరువుకోన సమీపంలో మకాం వేసినట్లు రైతులు తెలిపారు. వరినారు మళ్లలో తిరగాడినట్లు రైతులు తెలిపారు. గురికానివారిపల్లె, గట్లువారిపల్లె రైతులు పొలాల వద్దకు వెళ్లడానికి భయపడుతున్నారు.

23న సామాజిక తనిఖీ సభ

వి.కోట, జనవరి 19: వి.కోట మండల పరిధిలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఈ నెల 23న సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఏపీవో అశోక్‌రెడ్డి తెలిపారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో 23న ఉదయం జరిగే సామాజిక బహిరంగ సభకు మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు విధిగా పాల్గొనాలని కోరారు.

22న విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలి

సోమల, జనవరి 19: ఈనెల 22న శ్రీరామ మందిర ప్రారంభం, బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించాలని పుంగనూరు నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ గన్నా మదనమోహన్ విద్యాశాఖను కోరారు. కుటుంబసభ్యులతో కలసి విద్యార్థులు అయోధ్యలో జరిగే కార్యక్రమాలను తిలకించేందుకు సెలవుఇవ్వాలని కోరారు.

రేపటి నుంచి జయహో బీసీ సదస్సులు

కుప్పం, జనవరి 19: కుప్పం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి జయహో బీసీ సదస్సులు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈనెల 21న కుప్పం పురపాలక సంఘం, 23న రామకుప్పం మండలం, 24న శాంతిపురం మండలం, 25న కుప్పం మండలం ఎన్.కొత్తపల్లె, 28 ఆదివారం గుడుపల్లె మండలాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

కులగణన సర్వే ప్రారంభం

గంగవరం, జనవరి19 : పలమనేరు మున్సిపాలిటీలో శుక్రవారం కులగణన సర్వే ప్రక్రియ ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా సచివాలయ సిబ్బంది, మున్సిపల్ ఛైర్‌పర్సన్ చాముండేశ్వరి కులగణన వివరాలు సేకరించారన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు కులగణనకు వచ్చే సచివాలయ సిబ్బందికి సహకరించి పూర్తివివరాలు అందించాలని కమిషనర్ కోరారు.

సర్వే చిత్తశుద్ధితో చేయండి

సోమల, జనవరి 19: కులగణన సర్వేను వలంటీర్లు చిత్తశుద్ధితో పూర్తిచేయాలని ఎంపీడీవో నాగరాజ అన్నారు. శుక్రవారం ఇరికిపెంటలో జరుగుతున్న సర్వేను ఆయన తనిఖీ చేశారు. వలంటీర్ల ప్రతి కుటుంబాన్ని సందర్శించి వారు చెప్పే వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మేనక, సర్పంచ్ రెడ్డెప్ప పాల్గొన్నారు.

రొంపిచెర్ల : గానుగచింత పంచాయతీలో కుల గణనను ఎంపీడీవో రాజేంద్ర పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ నుంచి 24 వరకు కుల గణన సర్వే జరుగుతుందన్నారు.

రేపు కుప్పంలో కంటి చికిత్సా శిబిరం

కుప్పం, జనవరి 19: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం మెగా ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ జగదీష్‌బాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించే ఈ శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, అర్హులైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కడపనత్తంలో ఆరోగ్యసురక్ష

బైరెడ్డిపల్లె, జనవరి 19 : మండలంలోని కడపనత్తంలో శుక్రవారం ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాన్ని ఎంపీపీ రెడ్డెప్ప ప్రారంభించారు. ఆరోగ్యసమస్యలతో బాధపడుతున్న వారు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు కిజియారాణి, ప్రవీణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, విజయచంద్ర పలువురికి వైద్యపరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



వి.కోట, జనవరి 19: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముల వారి అక్షింతలను బీజేపీ నేతలు వి.కోట మండల పరిధి గ్రామాల్లో పంపిణీ చేస్తున్నారు. ఇటీవల అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను పట్టణంలోని అయ్యప్ప ఆలయంలోకి తీసుకువచ్చి అక్కడ మరికొందరు తీసుకువచ్చిన బియ్యాన్ని వాటితో కలిపి అక్షింతలుగా తయారు చేశారు. ఆపై అన్ని గ్రామాలకు సరిపడేటట్లు ప్రత్యేక బ్యాగుల్లో వాటిని నింపి పంపారు. పలమనేరు అసెంబ్లీ కన్వీనర్ విజయ్ నేతృత్వంలో కొంగాటం, కె.నక్కనపల్లెలో సీనియర్ నేత కృష్ణ నేతృత్వంలో అక్షింతలు ఇంటింటా పంచి పెట్టారు.

టీడీపీ ఆర్థికసాయం



రామకుప్పం, జనవరి 19: మిట్టపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త నారాయణప్ప గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, మాజీ సర్పంచు రామకృష్ణప్ప, నేతలు విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, సుబ్బయ్య, మునిరాజు, నవీన్, అల్లీశీనా, సుకుమార్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు శుక్రవారం నారాయణప్ప మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించండి


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, జనవరి 19: నగరపాలక పరిధిలోని 150 పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనకు సత్వర చర్యలు తీసుకోవాలని ఏఈఆర్వో, కమిషనర్ అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులపై శుక్రవారం సెక్టోరియల్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, వార్డు అమినిటీ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్లు, నీటి సరఫరా, ఫర్నీచర్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం ఇంజనీరింగ్ అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈ గోమతి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను నెలాఖరుకు పూర్తిచేయండి

చిత్తూరు, జనవరి 19: పూణేపల్లె వద్ద నిర్మిస్తున్న టిడ్కో గృహ సముదాయాలను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని కమిషనర్ అరుణ టిడ్కో అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆమె పూణేపల్లె వద్ద నిర్మిస్తున్న టిడ్కో గృహసముదాయాన్ని పరిశీలించారు. గృహ సముదాయాల్లో ఎలక్ట్రికల్, శానిటేషన్, రోడ్ల నిర్మాణాలు, మురికినీటి పనులను పరిశీలించారు. మొత్తం 2832 గృహాలను సిద్ధం చేసినట్లు కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో టిడ్కో ఈఈ వెంకటముని, సీఎంఎం గోపి, టిడ్కో కన్సల్టెంట్ ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

చిత్తూరు, జనవరి 19: నగరంలో కూరగాయల మార్కెట్లు, కూడళ్లు, ప్రధాన ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కమిషనర్ అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొంగారెడ్డిపల్లె కూరగాయల మార్కెట్‌లో శానిటేషన్ పనులను తనిఖీ చేశారు. దుకాణ దారులతో మాట్లాడారు. కూరగాయల వ్యర్థాలను పారిశుధ్య కార్మికులకు అందివ్వాల న్నారు. ట్రాఫిక్, ప్రజా రవాణాకు అడ్డులేకుండా దుకాణాలను లోపలివైపు ఏర్పాటు చేసుకోవాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహ, సీఎంఎం గోపి పాల్గొన్నారు.

పొరబాట్లకు తావులేకుండా కులగణన

చిత్తూరు, జనవరి 19: కుల గణన సర్వే పొరబాట్లకు తావులేకుండా చేయాలని కమిషనర్ అరుణ సూచించారు. శుక్రవారం సత్యనారాయణపురం, వెంకటేశ్వర కాలనీ పరిధిలో శుక్రవారం జరిగిన కుల గణన సర్వే తీరును కమిషనర్ తనిఖీ చేశారు. వలంటీర్ యాప్‌లో కుల గణన సర్వేకు సంబంధించి వివరాల నమోదు అంశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వలంటీర్లు, వార్డు కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. వారం రోజుల్లో సర్వే పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం గోపి, వార్డు కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కుల గణన సర్వే పరిశీలన


కాళికాపురంలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో

విజయపురం, జనవరి 19: మండలంలోని కాళికాపురంలో కుల గణనపై నిర్వహించిన సర్వేను శుక్రవారం ఆర్డీవో సుజన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో కుల గణనను పకడ్బందీగా నిర్వహించాలని, సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందు పరచాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో డీటీ అశోక్, ఈవోపీఆర్డీ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే శుక్రవారం మండల అధికారులు ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కులగణన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి శంకరయ్య, సర్పంచ్ ఉమాదేవి క్రిష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం: జనసేన


కూలీలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న స్వామినాథన్

విజయపురం, జనవరి 19: వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని జిల్లా జనసేన కార్యదర్శి స్వామినాథన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కళియంబాకం ఆదిఆంధ్రవాడలో భవిష్యత్తుకు బాబు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన పార్టీలను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు వినోద్, శరవణ, సంయుక్త కార్యదర్శులు పరుశురాం, రవి, జనసైనికులు పాల్గొన్నారు.

కాణిపాకంలో స్వచ్ఛ తీర్థ కార్యక్రమం

ఐరాల(కాణిపాకం), జనవరి 19: కాణిపాకంలో శుక్రవారం స్వచ్ఛతీర్థ కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్, ఈవో కార్యాలయాలు, అతిథి భవనం, సబ్‌స్టేషన్‌ను ఆలయ సిబ్బంది, అధికారులు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ వాసు, కోదండపాణి శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిరుమలగిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాల్లో శుభ్రతా చర్యలు

కార్వేటినగరం, జనవరి 19: కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామి ఆలయ పరిసరాలను బీజేపీ నాయకులు శుభ్రం చేశారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో ఆలయ స్వచ్ఛత కార్యక్రమం నిర్వహి స్తున్నారు. ఇందులో భాగంగా ఇక్కడి పరిసరాల్లో చెత్తాచెదారం శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ యువ మోర్చా నాయకులు యువరాజు, పురుషోత్తంరాజు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం



నగరి, జనవరి19: నగరి పట్టణ పరిధిలోని కొత్తపేట వద్ద జరిగిన పీపీఎల్ క్రికెట్‌లీగ్ పోటీల విజేతలకు నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ బహుమతులను ప్రదానం చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, వీకేఎస్‌వాసు, ఆర్ముగం, టీఎన్‌టీయూసీ బాలాజీ, గునశేఖర్, బాలు, నాయకులు పాల్గొన్నారు.

వేలిముద్రలు పడక..అందని పథకాలు

గుడిపాల, జనవరి 19: మండలంలోని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు డివైజ్‌లు లేవు. ఫలితంగా ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందడంలేదు. ప్రభుత్వ పథకాలు లబ్ధిపొందాలంటే తప్పనిసరిగా వేలిముద్రలను తప్పనిసరిగా వేయించాల్సి ఉంది. మండలంలో 27 పంచాయతీలకు గాను 17 సచివాలయాలు ఉన్నాయి. వాటిలో కేవలం నాలుగైదు సచివాలయాల వారికి తప్ప మిగిలిన సచివాలయాల్లో డివైజ్‌లు లేవు. దీంతో నూతన రేషన్ కార్డులు, పింఛన్లు, ఇండ్ల స్థలాలు సకాలంలో చేయలేక పెండింగ్‌లో ఉన్నాయి. డివైజ్‌లు లేకపోవడంతో ఇక పథకాలు ఏమి అమలుచేస్తారోనని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి డివైజ్‌లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బకాయిలు చెల్లించాలి : యూటీఎఫ్

చిత్తూరు (సెంట్రల్), జనవరి 19: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం రాత్రి అంబేద్కర్ విగ్రహం ఎదుట కొవ్వొత్తులతో నిరసన చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీ.వీ. రమణ, జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ 12వ పీఆర్సీ విధివిధానాలను రూపొందించాలని, 30శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

నగరి: తమ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నాయకులు నగరిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. పీఆర్సీ, డీఏ, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, జీఐఎస్‌లకు సంబంధించిన ఆర్థిక డిమాండ్లపై ఉపాధ్యాయులు నిరసన గళం విప్పారు. ఈకార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ముని రత్నం, వంశీకృష్ణ నగరి, నింద్ర, విజయపురం మండలాల యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

చిత్తూరు, జనవరి 19: పరీక్ష రాసేందుకు చిత్తూరుకు వచ్చిన ఓ విద్యార్థిని తిరిగి ఇంటికి రాకపోవడంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. బంగారుపాళ్యం మండలం తుంబకుప్పం గ్రామానికి చెందిన కుసుమ (18) చిత్తూరులోని వీసీఆర్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. శుక్రవారం సెమిస్టర్ పరీక్షలు రాసేందుకు వచ్చింది. తిరిగి ఇంటికి చేరలేదు. దాంతో తల్లి మమత ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాబోయేవే వైసీపీకి చివరి ఎన్నికలు: టీడీపీ



శ్రీరంగరాజపురం, జనవరి 19: రాబోయే ఎన్నికలే వైసీపీ ప్రభుత్వానికి చివరివని టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్‌నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం యు.ఎం.పురం గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. బూత్ నెంబరు 159 ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ మోహన్‌నాయుడు నిరంజన్‌రెడ్డి, హేమాద్రియాదవ్ మణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు జయహో బీసీ గర్జన

శ్రీరంగరాజపురం, జనవరి 19: పుల్లూరు క్రాస్‌రోడ్డులో శనివారం నిర్వహించే జయహో బీసీ గర్జన కార్యక్రమాన్ని మండలంలోని బీసీలు జయప్రదం చేయాలని బీసీ సంఘం మండల అధ్యక్షుడు డొడ్డ హేమాద్రియాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పుల్లూరు క్రాస్ రోడ్డులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారని తెలియజేశారు. శ్రీధర్ యాదవ్, కోలా జయచంద్ర, రవి యాదవ్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రలో బ్యాడ్మింటన్ పోటీలు

పాలసముద్రం, జనవరి 19: మండలంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పాలసముద్రం, వెంగళరాజు కుప్పం ఉన్నత పాఠశాల ఆవరణంలో తొమ్మిది సచివాలయాల పరిధిలోని క్రీడాకారులతో పురుషులు, మహిళలకు బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలు నిర్వహించినట్లు ఎంపీడీవో రామనాథరెడ్డి పేర్కొన్నారు.

యోగి వేమనకు నివాళులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 19: 'విశ్వదాభిరామ వినురవేమ' అనే మకుటంతో వేమన పద్యాలు తెలుగువారికి సుపరిచితమని, పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు రచించి యోగివేమన మెప్పించారని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. యోగి వేమన జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన భవనంలో వేమన చిత్రపటానికి కలెక్టర్ షన్మోహన్ పుష్పాంజలి సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాజశేఖర్, బీసీ సంక్షేమశాఖ అధికారి రబ్బాని బాషా, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మోహన్‌బాబు, కలెక్టరేట్ ఏవో కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి నివాళి

వెదురుకుప్పం, జనవరి 19: పాతగుంట గ్రామంలో టీడీపీ నాయకులు చంగల్‌రెడ్డి(75) మృతి చెందాడు. శుక్రవారం ఆయన మృతదేహాన్ని టీడీపీ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళుల ర్పిం చారు. అంజలి ఘటించిన వారిలో టీడీపీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్, నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షురాలు చిట్టెమ్మ, నాయకులు ఆనందరెడ్డి, షణ్ముగరెడ్డి తదితరులు ఉన్నారు.

జర్నలిస్టుల ఇళ్లస్థలాలపై సమీక్ష

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 19: కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో శుక్రవారం సాయంత్రం జర్నలిస్టులకు ఇండ్లపట్టాల మంజూరుపై ఏర్పాటైన జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. సమాచారశాఖ ప్రాథమిక పరిశీలన అనంతరం 301 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందాయని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియను రెవిన్యూశాఖ వేగవంతం చేయాలని ఆదేశించారు. డీఆర్వో రాజశేఖర్, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, చిత్తూరు ప్రెస్‌క్లబ్ కార్యదర్శి అశోక్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బంగారుపాళ్యం, జనవరి 19: చెన్నై -బెంగళూరు జాతీయ రహదారిలోని మొగిలి వద్ద గల శ్రీని ఫుడ్ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు .. బైరెడ్డిపల్లి మండలం చింతలగుట్టకు చెందిన కార్తీక్ కుమారుడు శివ, రెహమాన్ కుమారుడు అక్రమ్ తమ స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. పలమనేరు నుంచి శ్రీని ఫుడ్ ఫ్యాక్టరీకి వెళ్లేందుకు ఈషర్ వాహనం మలుపు తిరుగుతూ ద్విచక్రవాహన దారులను ఢీకొంది. శివ, అక్రమ్‌లకు తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శివ (18) మృతిచెందాడు. ఏఎస్ఐ మల్లప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రోన్‌తో మందులు పిచికారీ చేయాలి

పాలసముద్రం, జనవరి 19: రైతులు డ్రోన్ ఉపయోగించి పురుగుమందులు, నానోఫర్టిలైజర్స్‌ను పంటలకు పిచికారీ చేయాలని అలాచేస్తే తక్కువ ఖర్చు అవుతుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసులు తెలియజేశారు. శుక్రవారం మండలంలోని ఆముదాల గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ డ్రోన్ కొనుగోలుకు రూ.12 లక్షలు అవుతుందన్నారు. ఇందులో కేంద్రప్రభుత్వం రూ.4లక్షల వరకు సబ్సిడీ అందజేస్తుందన్నారు. పది నిమిషాల్లో ఎకరా పైరుకు మందు పిచికారీ చేయవచ్చని వివరించారు. అనంతరం డ్రోన్ పనితీరును రైతులకు చూపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్ నాయుడు, డీటీ మధు, ఎంఈవో రాజేంద్రప్రసాద్, ఏవో ఢిల్లీబాబు, ఈవోపీఆర్డీ రమేష్, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసీపీ మళ్లీ వస్తే ప్రజల భూముల తాకట్టు : టీడీపీ


ఎం.నాశంపల్లెలో సంక్రాంతి కానుక అందజేస్తున్న థామస్

గంగాధరనెల్లూరు, జనవరి 19: మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే ప్రజల భూములను బ్యాంకుల్లో తాకట్టు పెట్టడం ఖాయమని టీడీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ హెచ్చరించారు. శుక్రవారం 'బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ, మనఇంటికి - మన థామస్' కార్యక్రమంలో భాగంగా ముక్కళత్తూరు పంచాయతీలోని పలుగ్రామాల్లో పర్యటించారు. ప్రతి ఇంటికీ సంక్రాంతి కానుకగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎం.నాశంపల్లెలో ఆయన మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రతిమండలంలో వంద పడకల ఆస్పత్రిని ఏర్పాటుచేయిస్తానని, నియోజకవర్గ కేంద్రంలో పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేసి నిరుద్యోగ సమస్యను తీరుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల క్రిష్ణమనాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, టీడీపీ జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, విశ్రాంత ఎస్పీ చిన్నస్వామి, టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, నియోజకవర్గ మైనారిటీ సెల్ ప్రధానకార్యదర్శి నియాజ్‌అలీ, పార్లమెంట్ తెలుగురైతు అధికార ప్రతినిధి మోహన్‌నాయుడు, టీడీపీ బూత్ కన్వీనర్ ప్రభాకర్‌నాయుడు, మాజీ సర్పంచ్‌లు జాన్, పుష్పరాజ్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'రా... కదలిరా' కార్యక్రమం

చిత్తూరు సిటీ, జనవరి 19: ఈ నెల 21వ తేదీ నుంచి టీడీపీ - జనసేన సంయుక్తంగా 'రా.. కదలిరా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయని శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయ వర్గం తెలిపింది. ఈ కార్యక్రమంలో భాగంగా గడపగడపకూ మినీ మ్యానిఫెస్టోను వివ రించనున్నారు. పార్టీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఉన్న ఆశావహులు ఉమ్మడిగా కలసి కార్యక్రమంలో పాల్గొంటారు. ఆదివారం స్థానిక దొడ్డిపల్లెలోని కన్నికలమ్మ ఆలయంలో ఉదయం 9 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి సంబంధించి టీడీపీ, జనసేన పార్టీ నేతలతో శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.

చిరుధాన్యాల ఉత్పాదకతను ప్రోత్సహించండి: జేసీ


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 19: చిరుధాన్యాల ఉత్పాదకతను మరింత ప్రోత్సహించాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జేసీ మాట్లాడుతూ జిల్లాలో రాగిపంట ఉత్పత్తికి మరింత అవకాశాలు ఉన్నాయ న్నారు. మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రానున్న మామిడి సీజన్‌కు సంబంధించి ఇప్పుడే ఉద్యానశాఖ అధికారులు అవగాహన సమావేశాలు ఏర్పాటుచేసి రైతులు ఎగుమతుల ద్వారా మంచి ధర పొందేలా చేస్తున్నట్లు ప్రకటించారు. పీఎంకే ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, పశుసంవర్థకశాఖ జేడీ ప్రభాకర్, సభ్యులు గోవర్దన్ బాబి, జగదీశ్వర్ రెడ్డి తదితరులు మాట్లాడారు.

నారాయణస్వామికే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి


సమావేశమైన వైసీపీ నాయకులు

గంగాధరనెల్లూరు, జనవరి 19: డిప్యూటీ సీఎం నారాయణ స్వామికి ఎంపీ టికెట్ వద్దని జీడీ నెల్లూరు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం జీడీ నెల్లూరులో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో వైసీపీ మండల కన్వీనర్ పూర్ణచంద్రా రెడ్డి, వైసీపీ రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి, మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ వేలుమొదలి, బుగ్గాపట్నం సర్పంచ్ మునిరాజారెడ్డి, ఎంపీటీసీ లారెన్స్ సుధాకర్‌నాయుడు, అమూల్‌నాథన్, కుట్టి పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం వర్గీయుల నిరసన గళం


వెదురుకుప్పంలో వైసీపీ శ్రేణుల నిరసన

వెదురుకుప్పం/ కార్వేటినగరం, జనవరి 19: డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగానే ప్రకటించాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వెదురుకుప్పంలో వైసీపీ నాయకులు మీడియాతో మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నిరసన తెలియజేశారు. నారాయణ స్వామికి ఎమ్మెల్యే టికెట్ ప్రకటించక పోతే తమ పార్టీ పదవులకు, పార్టీ సభ్యత్వాలకు రాజీనామా చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బండి గోవర్ధన్ రెడ్డి, జడ్పీటీసీ చలంపాళ్యం సుకుమార్, గృహ సారథుల మండల కమిటీ కన్వీనర్ బట్టే సుబ్రహ్మణ్యం, వైసీపీ మండల అధ్యక్షులు పద్మనాభరెడ్డి తదతరులు ఉన్నారు.

- కార్వేటినగరంలో ఎంపీపీ లత, కార్వేటినగరం సర్పంచ్ ధనంజయవర్మ, కో-ఆప్షన్ సభ్యులు రత్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో నారాయణ స్వామికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని, ఎంపీగా వద్దని నిరసన తెలిపారు.

భక్తి భావాలు పెంపొందించుకోవాలి : టీడీపీ


టీడీపీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు కిషన్‌చంద్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

వెదురుకుప్పం, జనవరి 19: ప్రజలు భక్తి భావాలను పెంపొందించుకోవాలని, దానికి ఆలయాలు, ధ్యాన మందిరాలు అవసరమని టీడీపీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్ అన్నారు. శుక్రవారం మంగుంటలో నూతనంగా నిర్మించిన ఆవుదేవర ఇరగలమ్మ ఆలయ నిర్మాణ శిలాఫలకాన్ని ఆయన ప్రారంభించారు. ఆలయంలో పూజలు చేయించారు. ఆలయానికి విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్ఆర్‌పురం మండల కార్యనిర్వాహక కార్యదర్శి సిద్ధయ్యశెట్టి, నాయకులు జనార్ధన్‌రెడ్డి, భూపతిరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు హాజరయ్యారు.

దళితులపై జగన్‌ది కపట ప్రేమ: టీడీపీ


నగరిలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నగరి జనవరి 19: దళితులపై సీఎం జగన్‌ది కపట ప్రేమ అని దళితనాయకులు రమేష్‌బాబు, బాలాజీ, అల్లిముత్తు, కన్నయ్య విమర్శించారు. నగరి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాలుగేళ్లుగా అంబేడ్కర్ విదేశీ విద్యను అటకెక్కించడంతో పాటు ఎస్సీ కార్పొరేషన్‌ను మూసివేసిన దళిత ద్రోహి జగన్ అని విమర్శించారు. జగన్ కపట ప్రేమను దళితులు గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణస్వామి నాయుడు, మణి, చిత్తురు బాబునాయుడు, వినోద్ పాల్గొన్నారు

గంగాధరనెల్లూరు: వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు దళితులను చంపించేసి విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం పెడితే సరిపోతుందా అని టీడీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ ధ్వజమెత్తారు. గంగాధరనెల్లూరు మండలం ముక్కళత్తూరు పంచాయతీ ఎం.నాశంపల్లె శుక్రవారం నేతలతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో దళితుల కోసం అమలు చేసిన 27 సంక్షేమ పథకాలను జగన్ రద్దుచేశారని విమర్శించారు. ఇప్పుడు ఓట్ల కోసం మళ్లీ దళితులను మోసం చేసేందుకు కుట్ర పన్నారన్నారు. ఈ సమావేశంలో నేతలు ఎర్రగుంట్ల క్రిష్ణమనాయుడు, రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి, వెంకటేష్, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, విభూషణ్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి


సూచనలిస్తున్న ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్

వెదురుకుప్పం, జనవరి 19: ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు మందిరంలో సెక్టోరియల్ అధికారులు, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో వారు సమావేశం నిర్వహించారు. మండలం లో 41 పోలింగ్ కేంద్రాలకు గాను 26 కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు అవసరమని గుర్తించామన్నారు. సంబంధిత పాఠశాలల నిధులతో ఈ నెల 27వ తేదీ లోగా ఆ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ తిమ్మరాజు, పంచాయతీరాజ్ ఏఈ మురళీ, ఏవో వనిత, ఎంఈవోలు దామోదరం, మహేశ్వరరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవ తప్పిదాలవల్లే రోడ్డు ప్రమాదాలు

చిత్తూరు సిటీ, జనవరి 19: మానవ తప్పిదాలవల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయని ఎంవీఐ వాసుదేవరెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం యాదమరి మండలంలోని ఐటీసీఎల్ కంపెనీలో స్థానిక పోలీసులతో కలసి ట్రక్కు, క్యాబ్, ఆటో, డ్రైవర్లకు, కార్మికులకు, ప్రజలకు రోడ్డు భద్రాత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. మద్యం సేవించి, అతివేగంగా, విశ్రాంతి లేకుండా వాహనాలు నడపరాదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు వాసుదేవరెడ్డి, టీఎన్ మురళి, దీపిక, ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయానికి ద్విచక్ర వాహనం వితరణ


భక్తవత్సల నాయుడిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 19: జిల్లా టీడీపీ కార్యాలయ అవసరాల కోసం పార్టీ జిల్లా మాజీ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి, టీవీఎస్ షోరూం అధినేత భక్తవత్సలం నాయుడు ద్విచక్ర వాహనాన్ని వితరణగా ఇచ్చారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ద్విచక్రవాహనాన్ని టీడీపీ నేతలకు ఆయన అందించారు. ఈ సందర్భగా పార్టీ నేతలు ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు చంద్రప్రకాష్, సురేంద్రకుమార్, సీఆర్ రాజన్, కోదండయాదవ్, సప్తగిరి ప్రసాద్, మోహన్‌రాజ్, రాజశేఖర్, మేషాక్, శశికర్ బాబు, యుగంధర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ కృషి మరువలేనిది: కలెక్టర్



చిత్తూరు కలెక్టరేట్, జనవరి 19: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ దేశంలో సమానత్వం కోసం చేసిన కృషి మరువ లేనివని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో పీఎంకే ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, డీఆర్వో రాజశేఖర్, సంక్షేమశాఖ అధికారి రాజ్యలక్ష్మి, బీసీ సంక్షేమశాఖ డీడీ రబ్బానిబాషా, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా సీఎం జగన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్వాడీల నిరసన

కార్వేటినగరం, జనవరి 19: కార్వేటినగరం ఎంపీడీవో ఆఫీసు వద్ద కొనసాగుతున్న అంగన్వాడీ కార్యకర్తల నిరవధిక సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ గౌరవాధ్యక్షులు గంగరాజు అంగన్వాడీలకు మద్దతుగా దీక్ష వద్దకు విచ్చేసి మాట్లాడారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మమత, అంగాన్వాడీలు పాల్గొన్నారు.

సారా స్వాధీనం : ఒకరి అరెస్టు

చిత్తూరు సిటీ, జనవరి 19: సారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ రూరల్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. శుక్రవారం యాదమరి మండలంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రంగనాయక చెరువుకట్టపై సంపంగి నెల్లూరుకు చెందిన ఆర్ముగం విక్రయానికి సిద్ధంగా ఉంచుకున్న 20 లీటర్ల సారాను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసునమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మోహన్‌బాబు హెడ్‌కానిస్టేబుళ్లు క్రిష్ణయ్య, నాగరాజు, సుబ్రమణ్యం గౌడు పాల్గొన్నారు.

180వరోజు అన్నదానం



గుడిపాల, జనవరి 19: మండలంలోని అన్నా క్యాంటీన్‌లో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం 180వ రోజు అన్నదానం చేశారు. బెంగళూరుకు చెందిన బీవీ.ఇంటర్నేషనల్ స్కూల్ యజమాని బాలాజి భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవినాయుడు, కార్యదర్శి కిట్టు, టీడీపీ నాయకులు శివలింగారెడ్డి, జయచంద్ర నాయుడు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

400 మందికి అన్నదానం



పూతలపట్టు, జనవరి 19: టీడీపీ ఎన్ఆర్ఐ నేత ఊట్ల శ్యామసుందర్ రావు తమ సొంత నిదులతో ఏర్పాటు చేసిన అన్నాక్యాంటీన్‌లో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 400 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు హేమాద్రినాయుడు, నాయ కులు ఊట్ల నాగరాజనాయుడు, ఏకాంబరం, నిత్యానందం, సుబ్బరాజులు, దాము, భాస్కర్, బాలాజి, మధు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.